ఎరువులు పుష్కలం


భీమవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలో ఎరువులను సమృద్ధిగా వున్నాయి. ఇతర జిల్లాల్లో యూరియా కొరత ఏర్పడడంతో జిల్లా వ్యవసాయ అధికారులు అప్రమత్తమయ్యారు. వాస్తవానికి ఖరీఫ్‌లో జిల్లా రైతులు ఎరువులను తక్కువగా వినియోగిస్తారు. తాడేపల్లిగూడెం మండలంలోని మెట్టలో ఉద్యాన పంటలు, మొక్కజొన్న వంటి పంటలకు మాత్రమే కాస్త అధికంగా ఉపయోగిస్తారు. జిల్లాకు ఖరీఫ్‌లో 58,905 టన్నుల ఎరువులు అవసరం. ప్రస్తుతం 43,886 టన్నుల నిల్వలు ఉన్నాయి. మరో 16,279 టన్నుల ఎరువు కంపెనీల వద్ద సిద్ధంగా ఉంది. త్వరలోనే జిల్లాకు రానుందని, ఖరీఫ్‌కు ఎరువుల డోకా లేదని వ్యవసాయ శాఖ జేడీ వెంకటేశ్వరులు తెలిపారు.

ఖరీఫ్‌లో ఎరువుల నిల్వలు (టన్నుల్లో..)

	అవసరమైన ఎరువులు	ప్రస్తుత నిల్వలు
యూరియా	21,270	15,637
డీఏపీ	2,392	2,658
పొటాష్	5,387	4,449
కాంప్లెక్స్	23,464	18,343
సూపర్	6,391	2,478

ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్

భీమవరం క్రైం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):విద్యా సంస్థల సమీపంలో మాదకద్రవ్యాలు, గంజాయి, సిగరెట్ల అమ్మకాలను పూర్తిగా నిరోధించాలనే లక్ష్యంతో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ భీమారావు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్, విష్ణు కళాశాల సమీపంలోని పాన్, కిరాణా దుకాణాలను శనివారం సోదాలు చేశారు. వ్యాపారులు లాభాల కోసం విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని, పోలీసు అధికారుల ఆదేశాలను ధిక్కరిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు చేశారు. పలు దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని, వాటి యజమానులపై కేసులు నమోదు చేశారు.


పోలవరం వద్ద వరద ఉధృతి

పెరుగుతూ.. శాంతిస్తూ

- ఎగువన తగ్గిన వరద గోదావరి.. దిగువన ఉధృతి
- ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 5,29,209 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి
- దాచారం పునరావాస కాలనీకి 170 కుటుంబాలు..

కుక్కునూరు/ధవళేశ్వరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): గోదావరి నీటిమట్టం క్రమంగా పెరిగి నెమ్మదిగా తగ్గుతూ శాంతిస్తోంది. భద్రాచలం వద్ద శుక్రవారం రాత్రి 11 గంటలకు నమోదైన 38.80 అడుగుల నీటిమట్టం శనివారం ఉదయానికి 40.40 అడుగులకు, సాయంత్రం నాలుగు గంటలకు 41.30 అడుగులకు పెరిగింది. ఆరు గంటలకు 41.20 అడుగులకు తగ్గింది. ఈ క్రమంలో నెమ్మదిగా తగ్గటం ఆరంభించింది. గోదావరి ప్రభావంతో కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగు ఇప్పటికే నీట మునగగా ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిని వరదనీరు ముంచెత్తింది. కుక్కునూరు నుంచి వేలేరుపాడు వెళ్లే ప్రజలంతా వయా నల్లకుంట మీదుగా తిరిగి వెళ్తున్నారు. గొమ్ముగూడెం నుంచి 170 కుటుంబాలు దాచారం పునరావాస కానీలకి తరలి వెళ్లాయి. వీరికి భోజన సదుపాయం కల్పించారు.

పోలవరం వద్ద..

పోలవరం ప్రాజెక్టు స్పిల్ వేలోకి చేరుకున్న 6,98,782 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు చుట్టు ముట్టాయి, గోదావరి లంక భూములు నీట మునిగాయి. గండిపోశమ్మ ఆలయం నీట మునగడంతో ఆలయానికి రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

ఎగువ నీటి మట్టాలు ఇవే

ఎగువున అన్ని ప్రాంతాల్లో వరద ఉధృతి నెమ్మదించింది. దీంతో నీటిమట్టం తగ్గుదల నమోదైంది. శనివారం మధ్యాహ్నం నాలుగు గంటలకు కాళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 9.27 మీటర్లుగా నమోదు కాగా, పేరూరి వద్ద 14.35 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 11.60 మీటర్లు, భద్రాచలం వద్ద 41.30 అడుగులు, కూనవరం 16.02 మీటర్లు, కుంట వద్ద 7.05 మీటర్లు, పోలవరం 10.68 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 14.68 మీటర్లు నమోదైంది.

ధవళేశ్వరం వద్ద

ధవళేశ్వరం వద్ద శుక్రవారం సాయంత్రానికి 3.5 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి కలవగా శనివారం సాయంత్రానికి 5,29,209 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజి దిగువున ఉన్న లంకలో ఇసుక మైదానం పూర్తిగా వరద ప్రవాహంతో నిండిపోయింది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.60 అడుగులకు చేరుకుంది. ఆదివారం నాటికి నీటి మట్టం మరింత పెరిగి సుమారు ఏడు లక్షల క్యూసెక్కులకు పైగా ఎగువ నుంచి రావచ్చని ఫ్లడ్ సెక్షన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆయా అధికారులకు కేటాయించిన పరిధిలో ఫ్లడ్ డ్యూటీలలో అప్రమత్తంగా ఉన్నారు.

ప్రమాద హెచ్చరికలు


కాటన్ బ్యారేజ్ 175 గేట్లు పూర్తిగా ఎత్తివేసిన స్థితిలో పది లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు ప్రవహించడంతోపాటు గోదావరి నీటిమట్టం 11.75 అడుగులకు చేరుకుంటే మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేస్తారు. ఆపై 13 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తున్న సమయంలో నీటిమట్టం 13.75 అడుగులకు చేరుకుంటే రెండో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. 18 నుంచి 19 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తున్న సమయంలో నీటిమట్టం 17.50 అడుగులకు చేరుకుంటే చివరి ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది.

అన్నదాతల్లో జోష్

రబీలో 77,629 మంది రైతుల నుంచి 7,17,310 టన్నుల ధాన్యం కొనుగోలు

- ఇప్పటి వరకు రూ.1649.28 కోట్లు జమ
- బ్యాంకు లింకేజీ సమస్యతో రూ.4 కోట్లు పెండింగ్
- రైతులకు సమాచారం ఇచ్చిన అధికారులు
- ఖరీఫ్‌లో పలు సమస్యలను అధిగమించాలి

(భీమవరం-ఆంధ్రజ్యోతి):
రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను వారి ఖాతాల్లో దాదాపు జమ చేసింది. ఆధార్ లింకేజీ సమస్యలతో కొద్ది మంది రైతులకు మాత్రమే సొమ్ములు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించుకుంటే వారికి సొమ్ములు జమ చేస్తుంది. గడచిన రబీలో ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసింది. 85 శాతం మంది రైతులకు 24 గంటల వ్యవధిలోనే సొమ్ములు చెల్లించింది. అంచనాలకు మించి ధాన్యం సేకరించడంతో మిగిలిన 15 శాతం మంది రైతులకు సొమ్ములు చెల్లింపులో జాప్యం జరిగింది. తాజాగా బకాయిలు మొత్తం చెల్లించడంతో రైతుల ఆనందానికి అవధులు లేవు. జిల్లాలో బకాయి వున్న రూ.182 కోట్లను ఈ నెల 11న ఒక్కరోజే రైతు ఖాతాల్లో జమచేసింది. బ్యాంకు లింకేజీ సమస్య కారణంగా రూ.4 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత రైతులకు అధికారులు సమాచారం అందించారు.



ఖరీఫ్‌లో మేల్కోవలసిందే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధాన్యం సేకరణలో రైతులకు పూర్తి వెసులుబాటు లభించింది. మిల్లులకు పంపడానికి ఎదురుచూసే ఇబ్బందులు తప్పాయి. గడచిన ఖరీఫ్‌లో కోతలు అయిన వెంటనే మిల్లులకు తరలించేశారు. రబీలోనూ కొద్దిపాటి ఇబ్బందులు మినహా సక్రమంగానే ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. అకాల వర్షాలు కురిసినా కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టలేదు. మిల్లర్లతో సంప్రదించి తడిసిన ధాన్యానికి కూడా మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ప్రభుత్వం అదే తరహాలో కొనుగోలు చేస్తే రైతులకు ఇబ్బంది ఉండదు. కచ్చితమైన అంచనాతో ఉండాలి. సంచులను ముందుగానే భద్రపరచుకోవాలి. గడచని రబీలో కొన్ని మండలాల్లో సంచుల ఇబ్బంది తలెత్తింది. ఖరీఫ్‌లో అటువంటి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. అప్పుడే సక్రమంగా ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉంటుంది, వర్షాలు కురిస్తే ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు ఇబ్బంది పడాల్సి వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు ధాన్యం మిల్లులకు తరలించాలి. రైతు ఖాతాల్లో సొమ్ములు జమ అయ్యేలా ముందుగానే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. అప్పుడే ఖరీఫ్‌లోనూ ధాన్యం సేకరణ సవ్యంగా సాగనుంది.

రబీలో సేకరణ ఇలా

నియోజకవర్గం	రైతులు	ధాన్యం టన్నుల్లో	సొమ్ములు(రూ.)
ఆచంట	16,350	1,53,279.76	352.94 కోట్లు
తణుకు	15,847	1,31,142.00	301.00 కోట్లు
ఉండి	9,845	1,01,562.20	233.52 కోట్లు
నరసాపురం	3,649	29,598.36	68.12 కోట్లు
తాడేపల్లిగూడెం	14,781	1,50,525.20	345.47 కోట్లు
భీమవరం	6,719	65,423.88	150.82 కోట్లు
పాలకొల్లు	6,220	46,559.60	107.28 కోట్లు
గణపవరం	4,218	39,219.40	90.13 కోట్లు

- ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 77,629 మంది రైతుల నుంచి 7,17,310 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందుకు చెల్లించాల్సిన మొత్తం రూ.1,653.72 కోట్లు.
- ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో చెల్లించిన సొమ్ము రూ.1,300 కోట్లు.
- గత ఏడాది రబీలో 6.40 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఈ సారి 77 వేల టన్నులు అదనంగా సేకరించారు. ఈ కారణంగా మిగిలిన సొమ్ము రూ.353.72 కోట్లు చెల్లింపులో జాప్యం చోటు చేసుకుంది.
- ప్రైవేటు మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులంతా ప్రభుత్వంపైనే ఆధారపడ్డారు. ఫలితంగా సొమ్ములు అధికంగా చెల్లించాల్సి వచ్చింది. జాప్యం అనివార్యమైంది.
- పెండింగ్ బకాయిలను వారం రోజుల నుంచి విడుదల చేస్తూ వస్తున్నారు. జిల్లాలో శుక్రవారం నాటికి రూ.1649.28 కోట్లు చెల్లింపులను పూర్తి చేశారు. మరో రూ.4 కోట్లు బ్యాంకుల్లో సిద్ధంగా ఉన్నాయి.
- రైతులు లింకేజీ సమస్యలను పరిష్కరించుకుంటే వారి ఖాతాల్లో పడనున్నాయి. దీనికోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సర్కార్ బడిపై చిన్నచూపు

ఏటికేడాది తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

- గత ఏడాదితో పోలిస్తే నాలుగు వేలకు పైగా తగ్గుదల



భీమవరం రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఏటికేడాది విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లాలోని 1,492 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 89 వేల 600 మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఈ సంఖ్య 85 వేల 344. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య 4,256 తగ్గింది. ఒకటో తరగతి విద్యార్థుల్లో కొందరి సీడింగ్ జరగాల్సి వుంది. ఈ నెలాఖరు వరకు విద్యార్థుల చేరికలు ఉంటాయి కాబట్టి చదువుకునే వారి సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉంటుందని జిల్లా విద్యా శాఖ అంచనా వేస్తోంది. జిల్లాలోని 1,920 ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల్లో రెండు లక్షల 79 వేల 204 మంది విద్యార్థులు ఉన్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అర్హత మేరకు అందరికీ తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున లబ్ధి చేకూరింది. అయినప్పటికి ప్రభుత్వ పాఠశాలల్లో ఆశించిన మేర అడ్మిషన్లు పెరగలేదు. అయితే ప్రభుత్వ పాఠశాలల నుంచి ఈసారి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలల వైపు వెళ్లక పోవడం ఒక్కటే శుభపరిణామం.

ఏడాదిలో ఎన్నో మార్పులు

ప్రభుత్వ పాఠశాలల విద్యా విధానంలో గడిచిన ఏడాదిలో ప్రభుత్వం ఎన్నో మార్పులకు ప్రయత్నాలు చేసింది. విద్యా బోధనలో ప్రణాళిక రూపొందించింది. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తొమ్మిది వేల మందికిపైగా 72 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. అంతకు ముందు మూడేళ్లపాటు 50 శాతంలోపే ఉండేది. ఈ విద్యా సంవత్సరం ఆదిలోనే విద్యార్థులు ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు మోడల్ స్కూల్స్ తీసుకువచ్చారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు రోల్ తగ్గట్లు ఉపాధ్యాయులు ఏర్పాటు చేశారు. ప్రైమరీలోని రెండు సెమిష్టర్ల విధానం తెచ్చి చిన్నపిల్లలకు బరువు తగ్గేలా పుస్తకాలలో మార్పులు తెచ్చారు. విద్యార్థులకు అందించే విద్యాకిట్ నాణ్యత పెంచారు. ఇవన్నీ విద్యార్థులకు అకర్షణగా నిలిచాయి. ఇంకో వైపు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు క్యాంపెయిన్‌లు చేపట్టడం ద్వారా ఈ సంఖ్య మరింత తగ్గకుండా నిలువరించింది.

- వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ప్రయివేట్ బాట పట్టారు.
- 2021-22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య లక్షా 38 వేలు.
- 2023-24 వచ్చే సరికి ఈ సంఖ్య 99 వేలకు చేరింది.
- 2024-25 విద్యా సంవత్సరానికి 89,600 వేలకు పడిపోయింది.
- ఈ ఏడాది 2025-26 సంవత్సరంలో ఇప్పటి వరకు వున్న విద్యార్థుల సంఖ్య 85,344.
- జిల్లాలో ఈ నాలుగేళ్లపాటు గణాంకాలను పరిశీలిస్తే 52,656 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిపోయారు.

కుష్ఠు వ్యాధి కేసులు తగ్గుముఖం



- ఫలిస్తున్న వైద్యుల కృషి
- అనుమానిత కేసులు ముందే గుర్తింపు
- రోగులకు ప్రత్యేక చికిత్సలు, మందులు

తణుకు, జూలై 12(ఆంధ్రజ్యోతి):జిల్లాలో కుష్ఠు వ్యాధి తగ్గుముఖం పడుతోంది. నాలుగేళ్లగా నమోదవుతున్న గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కేసులు ప్రారంభ దశలోనే వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో గుర్తించి, మందులు వాడించడంతో కొత్త కేసులు పెరగడం లేదు. 2021-22లో 137 వెలుగు చూడగా, 2022-23లో 96 కేసులు, 2023-24లో 133 కేసులు, 2024- 25లో 89 నమోదయ్యాయి. జిల్లావ్యాప్తంగా కుష్ఠు ద్వారా అంగ వైకల్యం పొందిన వారు 630 మంది ఉన్నారు. వారికి డిజెబులిటీ ప్రివెన్షన్ మెడికల్ రిహేబిలిటేషన్ కింద ఏడాదిలో రెండు పర్యాయాలు మైక్రో సెల్యూలర్ రబ్బర్ చెప్పులతోపాటు 506 మందికి ఆరు వేలు చొప్పున లెప్రసీ పింఛన్లు ప్రభుత్వం అందజేస్తోంది. కుష్ఠు వ్యాధి తీవ్రతను బట్టి ఆసుపత్రిలో అడ్మిట్ చేయాల్సి వస్తే ఇది తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలోనే ఈ సదుపాయం వుంది. ఇక మందులు మాత్రం ప్రతి ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా పొందవచ్చు. వ్యాధి తీవ్రతను బట్టి ఆరు లేదా 12 నెలలు వైద్యం చేయించుకోవాలి. మందులు వాడకుండా అశ్రద్ధ చేస్తే ఈ వ్యాధి ఇతరులకు సంక్రమించే ప్రమాదం వుంది. శరీరంపై మచ్చలు ఉంటే సమీపంలోని ఆసుపత్రిలో తనిఖీ చేయించుకోవాలి. వ్యాధి తీవ్రతను బట్టి ఇన్‌పేషెంట్లుగా అడ్మిట్ అయితే.. ఉచితంగా వైద్య సేవలతోపాటు పిజియోథెరపీ, డ్రెస్సింగ్, మందులు భోజనం, వసతి కల్పిస్తారు.

నిర్లక్ష్యం చేయకూడదు



కుష్ఠు ప్రారంభ దశలో ఉన్నపుడు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. జిల్లాలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు అందుబాటులో ఉన్నాయి. కుష్ఠు పట్ల అనుమానం వచ్చినపుడు వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలి. నిర్ధారణ అయితే వైద్యుల సూచనలతో మందులు క్రమం తప్పకుండా వాడాలి.

- డాక్టర్ కె.రవికుమార్, జిల్లా కుష్ఠు నివారణ అధికారి

ఎట్టకేలకు..

తాడేపల్లిగూడెం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణానికి రూ.88 కోట్లు మంజూరు

- దశాబ్దాల సమస్యకు కూటమి సర్కార్ చెక్
- నెలాఖరు నాటికి టెండర్లు పూర్తి
- వచ్చే నెలలో పనులు ప్రారంభం


కడకట్లలో నిర్మిస్తున్న ఎస్‌టీపీ

తాడేపల్లిగూడెం, జూలై 12(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం పట్టణాన్ని దశాబ్దాల కాలంగా వేధిస్తున్న సమస్యపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నో ఏళ్లపాటు తీవ్ర ఇబ్బందులు పడిన పట్టణ ప్రజలకు ఇది నిజంగా శుభవార్తే. అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్‌కు మోక్షం కల్పిస్తూ.. పనులు పూర్తి చేసేందుకు సర్కార్ రూ.88 కోట్లు మంజూరుచేసింది. నెలాఖరులోపు టెండర్లు పూర్తి చేసి ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పనులు ప్రారంభిస్తారు.

దశాబ్దాల సమస్య

తాడేపల్లిగూడెం పట్టణ వాసుల కల అండర్ గ్రౌండ్ డ్రైనేజ్. దీనికోసం ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు 2008లో పనులు ప్రారంభించారు. పైపులైన్లు ఏర్పాటుచేశారు. కొన్నిచోట్ల పైపులైన్లకు వేసిన గోతులను పూడ్చకుండా వదిలేయడంతో ప్రయాణికులు, వాహన చోదకులు ప్రమాదాల బారినపడి గాయాలపాలయ్యారు. సీసీ రోడ్లను బద్దలుకొట్టి పైపు లైను వేసి గాడులను పూడ్చకుండా వదిలేయడంతో ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. మున్సిపల్ ఛైర్మన్‌గా బాధ్యతలు వహించిన ప్రస్తుత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ గోతులను పూడ్పించారు. పట్టణంలో 92 కిలోమీటర్ల పొడవున అండర్ గ్రౌండ్ పైపులైన్ ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి మిగిలిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. రూ.88 కోట్లతో యాగర్లపల్లిశివారులో సేవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ), రిక్షా పుంత వద్ద మరో ఎస్‌టీపీ నిర్మిస్తారు. శివాలయం వద్ద, కడకట్ల పాత రైల్వేగేట్ సమీపం వద్ద ఇంటర్ సెప్షన్ అండ్ డైవర్షన్లు ఏర్పాటు చేయనున్నారు. టూ టౌన్‌లో కొత్తగా 17 కిలోమీటర్ల పొడవునా కొత్తగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ కోసం పైపులైన్ల ఏర్పాటు కు టెండర్లలో పొందుపరిచారు.

వన్‌టౌన్ ఎస్‌టీపీ ట్యాంక్ పనులు 80 శాతం పూర్తి

- తాడేపల్లిగూడెం వన్‌టౌన్‌లో రూ.32.14 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎస్‌టీపీ పనులు 80 శాతం పూర్తి కావచ్చాయి.
- 2022 జూన్ 30న పనులకు శంకుస్థాపన జరగగా, ఢిల్లీకి చెందిన ఎస్ఎస్ ఇంజనీరింగ్ కంపెనీ పనులు చేస్తోంది.
- కడకట్లలోని యానాదుల కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ఎస్‌టీపీ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి.
- ఎయిర్ బ్లోయర్ బిల్డింగ్, అడ్మిన్ బ్లాక్, వర్క్ షాపు, స్టాఫ్ క్వార్టర్స్, సెంట్రల్ ఫ్యూజ్ బిల్డింగ్, క్లోరిన్ కాంటాక్ట్ ట్యాంక్ (సీసీటీ), గార్డు రూమ్, ప్రైమరీ ట్రీట్‌మెంట్ యూనిట్ (పీటీయూ), ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలి. ప్రహరి పనులు ప్రారంభించలేదు. సరిహద్దులను గుర్తించి ఇవ్వాలి.
- హౌసింగ్ బోర్డులో ఏర్పాటు చేసే లిఫ్టుటేషన్, సంజీవనగర్‌లో ఏర్పాటు చేసే లిఫ్టుటేషన్ పనులు, కడకట్ల బీసీ హాస్టల్ సమీపంలో వెట్‌వెల్ పనులు ప్రారంభించాలి.
- పైపులైన్ల ద్వారా వచ్చిన మురుగునీరు లిఫ్టుటేషన్‌కు చేరి వెట్‌వెల్‌కు వెళుతుంది. అక్కడ నుంచి ఎస్‌టీపీకి చేరడంతో శుద్ధి జరిగి ప్రక్రియ ముగుస్తుంది. కూటమి ప్రభుత్వం హయాంలోనే ఈ పనులు వేగవంతంగా చేసి పూర్తి చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రయత్నిస్తున్నారు.


మట్టి ఖర్చులు ఇవ్వండి

- ప్రభుత్వ పెన్షనర్లు మరణిస్తే ఒక్కొక్కరికి రూ.25 వేలు చెల్లింపు
- జిల్లావ్యాప్తంగా మూడు నెలల్లో 158 మంది మృతి
- ఒక్కరికి కూడా నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- కుటుంబ సభ్యుల ఎదురుచూపు

భీమవరం టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్లు మరణిస్తే మట్టి ఖర్చుల కింద ఒక్కొక్కరికి పది వేల రూపాయలతో పాటు ఒక నెల పెన్షన్ మొత్తాన్ని ప్రభుత్వం అందించేది. తర్వాత దీనిని రూ.15 వేలకు పెంచారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నెల పెన్షన్ మొత్తాన్ని ఇవ్వకుండా మట్టి ఖర్చుల కింద ఇచ్చే మొత్తాన్ని రూ.25 వేలకు పెంచింది. ఎవరైనా పెన్షనర్ మరణిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పది రోజుల్లో వారి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాకు ట్రెజరీ అధికారులు జమ చేసేవారు. కాని, గడిచిన మూడు నెలలుగా పెన్షనర్ మరణించినా మట్టి ఖర్చులు (హర్యామనల్) నిధులు విడుదల చేయలేదు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి జూలై నెలాఖరు వరకు 158 మంది చనిపోయారు. వీరిలో కొందరు స్పౌజ్ పింఛన్‌దారులు ఉన్నారు. వీరి ఎవరికి నగదు జమ కాలేదు. గతంలో ఎన్నడూ ఈ నిధులు విడుదలకు ఏ ప్రభుత్వం ఆపలేదని పెన్షన్‌దారులు, సంఘం నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు ట్రెజరీల వారీగా.. భీమవరంలో 40, తాడేపల్లిగూడెం 30, పాలకొల్లు 25, తణుకు 30, పెనుగొండ 8, నరసాపురం 15, ఆకివీడు 10 మందికి ఈ మట్టి ఖర్చుల నిధులు రావలసి ఉంది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పవర్‌ఫుల్ పాత్రలో



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో దేశవ్యాప్తంగా అంచనాలను పెంచేసింది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ఈ చిత్రంలో 'గౌర్నాయుడు' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. శనివారం అయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శివరాజ్‌కుమార్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. కాగా, ఈ సినిమాలో రామ్‌చరణ్ సరసన కథానాయికగా జాన్వీకపూర్ నటిస్తున్నారు. జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా సినిమా విడుదల కానుంది.

కథ విని ఉద్వేగానికి లోనయ్యా

- సెంథిల్ కుమార్



'ఒక సినిమా అంగీకరించే ముందు కథలో ప్రేక్షకులను కదిలించే బలమైన భావోద్వేగాలు ఉన్నాయా, లేవా? అని చూస్తాను. 'జూనియర్' సినిమా స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. బలమైన భావోద్వేగాలతో పాటు ప్రేమ, కుటుంబ విలువలతో సినిమా ఆద్యంతం హృద్యంగా ఉంటుంది' అని సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ అన్నారు. గాలి జనార్ధన్‌రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రాధాకృష్ణ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ నెల 18న 'జూనియర్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించిన సెంథిల్ కుమార్ మీడియాతో మాట్లాడారు. 'దర్శకుడు రాధాకృష్ణ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. కొత్త హీరోకు ఇలాంటి సినిమా చేయడం కొంచెం కష్టమే. కానీ కిరీటి ఒక సవాల్‌గా తీసుకొని ఈ సినిమా కోసం కష్టపడిన తీరు నాకు నచ్చింది. ఈ సినిమాలో పాటలతో పాటు కిరీటీ, శ్రీలీల జంట చేసిన డాన్స్‌లను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. కిరీటి మంచి నటుడు, అద్భుతమైన డాన్సర్. సెట్స్‌లో చాలా కష్టపడ్డాడు. తొలి చిత్రం 'జూనియర్'తోనే ఆయన ప్రేక్షకులను ఆకట్టుకుంటాడనే గట్టి నమ్మకం ఉంది. ఒక మంచి సినిమా అందించాలనే తపనతో నిర్మాతలు ఈ సినిమా తీశారు' అని చెప్పారు.

బ్యూటిఫుల్ మెలోడీ



రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. 'చి ల సౌ'తో జాతీయ అవార్డు అందుకున్న రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ నెల 16న సినిమా నుంచి 'నదివే' అంటూ సాగే పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ బ్యూటిఫుల్ మెలోడీకి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించారు. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కృష్ణన్ వసంత్.

యాక్టర్స్‌ని తిట్టాను.. కొట్టాను..

ప్రవీణ పరుచూరి



'మా 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమాలో రెండు పాత్రల మధ్య నడిచే సన్నివేశాలు కీలకంగా నిలుస్తాయి. వారి మధ్య వచ్చే సన్నివేశాలు అద్భుతంగా రాకపోతే సినిమా సాదాసీదాగా ఉంటుంది. అందుకే వారి నుంచి మంచి నటన రాబట్టాలనుకన్నాను. సెట్‌లో వారిని తిట్టాను, కొట్టాను, వారిపై రాళ్లు విసిరాను. మనం చేసే పాత్రలో జీవించడమే నటన అని నమ్ముతాను. అందుకే సినిమా కోసం ఏదైనా సరే తప్పదు. అందుకే వారిపట్ల అలా ప్రవర్తించినందుకు క్షమాపణలు చెప్పలేదు' అని దర్శకురాలు ప్రవీణ పరుచూరి చెప్పారు. రానా సమర్పణలో మనోజ్ చంద్ర, మోనికా జంటగా ప్రవీణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మనోజ్ చంద్ర మాట్లాడుతూ 'ప్రవీణ చేసే సినిమాల్లో నటిస్తే సరిపోదు, పాత్రల్లో జీవించాలి. అలా రామకృష్ణ పాత్రకు నేను ప్రాణం పోశానని నమ్ముతున్నాను' అని చెప్పారు.

స్నేహితులే రాజకీయ ప్రత్యర్థులు



ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో 'ప్రస్థానం' ఫేమ్ దేవా కట్టా, జయకిరణ్‌కుమార్ సంయుక్తంగా తెరకెక్కించిన వెబ్ సిరీస్ 'మయసభ'. 'రైజ్ ఆఫ్ ద టైటాన్స్' ట్యాగ్‌లైన్. విజయ్‌కృష్ణ లింగమనేని, శ్రీహర్ష నిర్మించారు. ఆగస్టు 7న ఓటీటీ వేదిక సోనీ లైవ్ ద్వారా అందుబాటులోకి రానుంది. తాజాగా, టీజర్‌ను విడుదల చేశారు. సంభాషణలు, ప్రధాన పాత్రధారుల మధ్య ఉన్న సంఘర్షణ, భావోద్వేగాలు ఆకట్టుకున్నాయి. ఇద్దరు స్నేహితులు కొన్ని పరిస్థితుల వల్ల రాజకీయ ప్రత్యర్థులుగా మారితే ఎలా ఉంటుందనేది కథాంశం. అయితే వీరిద్దరి పాత్రలు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డిని పోలి ఉంటాయని సమాచారం.

చెన్నైలో తెలుగు అబ్బాయి కథ



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తోన్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోంది. మ్యూజికల్ రొమాంటిక్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. శనివారం సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చెన్నైలో జీవనం కొనసాగిస్తున్న మధ్యతరగతి తెలుగు అబ్బాయిగా సంతోష్ శోభన్ కనిపిస్తున్నారు. చెన్నై నగరం బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ ప్రేమ కథా చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని కలిగిస్తుందని చిత్రబృందం పేర్కొంది.

'సెమిస్టర్'కు కనీస హాజరు ఉండాల్సిందే!

- పరీక్షలకు సంబంధించిన నిబంధన సరైందే
- బీటెక్‌పై హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీటెక్ విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యేందుకు కనీస హాజరుశాతం తప్పనిసరని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. దీనికి సంబంధించి జేఎన్‌టీయూ కాకినాడ, జీఎంఆర్‌ఐటీ రూపొందించిన నిబంధనలను సమర్థించింది. కనీస హాజరు నిబంధన సహేతుకం కాదని, ఏకపక్షం అంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు చట్టం ముందు నిలబడవని పేర్కొంది. సింగిల్ జడ్జి తీర్పులోని ఈ భాగాన్ని రద్దు చేసింది. అయితే, ప్రస్తుత కేసులో కోర్టు ఆదేశాల మేరకు విద్యార్థి కౌశిక్ తన 4, 5వ సెమిస్టర్‌ను కొనసాగించారని గుర్తు చేసింది. కౌశిక్ 4, 5 సెమిస్టర్లను రద్దు చేసి, తిరిగి ఆయనను 3వ సెమిస్టర్‌కు పంపించడం సముచితం కాదని అభిప్రాయపడింది. ఇలా చేయడం వల్ల కౌశిక్ అకడమిక్ ప్రయోజనాలు దెబ్బతింటాయని పేర్కొంది. జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అకడమిక్ రెగ్యులేషన్ 9(ఐ)(జే) ప్రకారం మేకప్ క్లాస్‌లకు హాజరుకావడం ద్వారా తగిన హాజరుశాతం సాధిస్తే పరీక్ష రాసేందుకు అర్హత సాధించవచ్చని గుర్తు చేసింది. హాజరులోపాన్ని సరిదిద్దుకునేందుకు వీలుగా మేకప్ క్లాస్‌లకు హాజరయ్యేందుకు కౌశిక్‌ను అనుమతించింది. ఈ తీర్పుని ప్రత్యేక పరిస్థితుల్లో ఇస్తున్నామని, భవిష్యత్తులో ఈ ఉత్తర్వులను ప్రామాణికంగా తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని జీఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్‌లో బీటెక్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) అభ్యసిస్తున్న బీవీకే కౌశిక్ అనారోగ్యం కారణంగా తరగతులకు హాజరుకాలేకపోయాడు. హాజరుశాతం 65% కన్నా తక్కువగా ఉందనే కారణంతో కళాశాల యాజమాన్యం ఆయనను మూడవ సెమిస్టర్ పరీక్షలకు అనుమతించలేదు. దీంతో కౌశిక్ హైకోర్టును ఆశ్రయించగా, పరీక్షలు రాసేందుకు అనుమతించిన కళాశాల యాజమాన్యం, ఫలితాలు మాత్రం వెల్లడించలేదు. దీంతో మూడవ సెమిస్టర్ ఫలితాలు వెల్లడించడంతో పాటు నాలుగవ సెమిస్టర్ క్లాసులకు హాజరయ్యేందుకు అనుమతించేలా కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరుతూ కౌశిక్ మరో పిటిషన్ దాఖలు చేశారు.

ఉపాధి కోసం వెళ్లారు...
ఉగ్ర మూకల బారిన పడ్డారు

- ఇన్‌స్టా ఉద్యోగ ప్రకటనతో మోసపోయిన ఇంజనీరింగ్ నిరుద్యోగులు
- థాయ్‌ల్యాండ్ వచ్చిన వారిని మయన్మార్‌కు తరలింపు
- డ్రగ్స్ తీసుకోవాలంటూ చిత్రహింసలు
- రక్షించాలని తల్లిదండ్రులకు ఫోన్
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ను కలిసిన తల్లిదండ్రులు

విజయనగరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మెరుగైన ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్లిన యువత ఉగ్ర, డ్రగ్స్ ముఠాల చేతుల్లో చిక్కుకోవడంతో స్థానికంగా వారి తల్లిదండ్రులు విలవిలలాడుతున్నారు. తమ పిల్లలను రక్షించి, సురక్షితంగా స్వస్థలాలకు రప్పించాలంటూ కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. మే నెలలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ఉద్యోగ ప్రకటన వచ్చింది. ఆకర్షణీయమైన ప్యాకేజీ కావడంతో విశాఖపట్నం నుంచి ముగ్గురు, విజయనగరం నుంచి ఇద్దరు, కడప జిల్లా నుంచి నలుగురు, హైదరాబాద్ నుంచి ముగ్గురు... మొత్తం 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన థాయ్‌ల్యాండ్ ప్రతినిధులతో వారు మాట్లాడారు. ఇంజనీరింగ్ చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న నిరుద్యోగ యువత... ప్రకటనదారులు చెప్పిన తీయని, ఆకర్షణీయమైన కబుర్లను నమ్మారు. వారు సూచించినట్లుగా వారివారి ప్రాంతాల నుంచి బయలుదేరి మే 9న థాయ్‌ల్యాండ్‌కు చేరుకున్నారు. థాయ్‌ల్యాండ్‌లో మొదటి రోజు చక్కగా చూసుకున్న ప్రకటనదారులు... ఆ మరుసటి రోజునే ఉద్యోగం కోసం వచ్చిన వారికి ముసుగులు వేసి మయన్మార్ తరలించారు. వారి కుటుంబ సభ్యులు చెప్పిన సమాచారం మేరకు... ఉద్యోగార్థులందరినీ మయన్మార్‌లో ఒక నది ఒడ్డున ఉన్న క్యాంప్‌లో ఉంచారు. చిత్రహింసలు పెట్టారు. డ్రగ్స్ తీసుకోవాలంటూ ఒత్తిడి చేశారు. నిరాకరించిన వారిపై విచక్షణారహితంగా దాడి చేశారు. వెళ్లిన 12 మందిలో విశాఖ, హైదరాబాద్‌కు చెందిన వారు ఇద్దరు... వారి చెర నుంచి తప్పించుకొని స్వస్థలాలకు చేరుకున్నారు. మిగిలిన 10 మంది అక్కడే ఉన్నారు. ఎవరూ లేని సమయంలో తల్లిదండ్రులకు ఫోన్‌లో తమ పరిస్థితిని బాధితులు వివరించారు. తామున్న ప్రాంతం లోకేషన్‌ను షేర్ చేశారు. తమను రక్షించాలంటూ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో బెంబేలెత్తిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటికే కడప, హైదరాబాద్ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇదే విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనితలను బాధితుల కుటుంబ సభ్యులు కలిశారు. స్పందించిన పవన్ కల్యాణ్, లోకేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖతో మాట్లాడారు. ఆ ఉగ్రమూకల చెరలో మనదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది వరకూ ఉన్నట్లు సమాచారం. తాము చేసుకున్న విన్నపాలపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ లేకపోవడంతో బాధితుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రాణాలతో తమ పిల్లలను ఇళ్లకు చేర్చాలని వారు కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

రాష్ట్రానికి 5 స్వచ్ఛ అవార్డులు


- 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్న మంత్రి నారాయణ

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదు నగరాలకు జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు వచ్చాయి. 'సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్' విభాగంలో 10 లక్షల జనాభాపైబడిన నగరాల్లో విజయవాడ, 3-10 లక్షలకు మధ్య ఉన్న నగరాల్లో గుంటూరు, 50 వేలు - 3 లక్షల మధ్య ఉన్న నగరాల్లో తిరుపతి అవార్డులు గెలుచుకున్నాయి. 'మినిస్టీరియల్ అవార్డ్ ప్రత్యేక కేటగిరి'లో జీవీఎంసీ విశాఖపట్టణం, మినిస్టీరియల్ అవార్డు రాష్ట్ర స్థాయి కేటగిరిలో రాజమండ్రికి అవార్డులు వచ్చాయి. ఈనెల 17న ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మంత్రి పొంగూరు నారాయణ ఈ అవార్డులను అందుకోనున్నారు. అవార్డుల రాకపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమ ఫలితంగానే జాతీయ స్థాయిలో రాష్ట్రంలోని ఐదు నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు సాధించాయని అన్నారు. జాతీయస్థాయిలో స్వచ్ఛ అవార్డులు సాధించడంలో విజయవాడ, గుంటూరు. తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రి నగర ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. అవార్డులు రావడానికి శ్రమించిన అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందికి పట్టాభి అభినందనలు తెలిపారు.









విద్యుత్‌ను ఆదమరుపుగా, తగిన జాగ్రత్తలు తీసుకోకుండా పట్టుకుంటే షాక్ తప్పదు. పెనుప్రమాదాలు సంబవిస్తాయి. ఈ ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని రైతులు, ప్రజలు జాగ్రత్తలు వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కరెంట్ ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పూర్తిగా వ్యవసాయ ప్రాంతం కావడంతో తరచూ పంటపొలాల్లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా పామాయిల్ తోటలలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పంట గెలలు కోసే సమయంలోనే ఎక్కువగా విద్యుత్ తీగలు తగిలి పలువురు మృత్యువాత పడుతున్నారు. వీటితో పాటు ఈదురుగాలులు వీచిన సమయంలో విద్యుత్ తీగలు తెగి పడిన సందర్భంలోను, సాధారణంగా సాంకేతిక ఇబ్బందుల కారణంగా వైర్లు తెగి రహదారులపై పడినప్పుడు వాటిని తగలడంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. ఈ ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఏలూరుసిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :



అజాగ్రత్తగా పట్టుకుంటే షాక్

రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా వర్షాకాలం సమయంలో అధికంగా జరుగుతూ ఉంటాయి. పంటపొలాల్లోనే కాకుండా ఇళ్లల్లోనూ విద్యుత్ వైరింగ్ సరిగా లేకపోతే షార్ట్ సర్క్యూట్ వంటి వాటి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిలో గణాంకాల్లోకి వచ్చేవి కొన్నే అయితే రానివి మరెన్నో ఉన్నాయనడంలో సందేహం లేదు. ఈదురు గాలుల సమయంలో విద్యుత్ తీగలు తెగిపడిన సందర్భంలో పొలాల నుంచి వచ్చే రైతులు మృత్యువాత పడడంతో పాటు, ఎప్పుడో వేసిన విద్యుత్ లైన్లు వల్ల పామాయిల్ తోటలు విరివిగా పెరగడం, వాటి గెలలు కోసే సమయంలో కోసే వస్తువులు విద్యుత్ తీగలకు తగలడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఏది ఏమైనా విద్యుత్ ప్రమాదాలు అరికట్టటానికి విద్యుత్ శాఖ ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా ప్రమాదాలు జరగటం శోచనీయం. విద్యుత్ ప్రమాదాలు మానవులకే కాదు జంతువులు కూడా బలి అవుతున్నాయి. పొలాల్లో గడ్డి మేత మేసే సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి పశువులు మృత్యువాత పడుతున్నాయి.

విద్యుత్ ప్రమాదాల నివారణకు అధికారులు ఎప్పటికప్పుడు విద్యుత్ కండక్టర్లును మారుస్తూనే ఉన్నారు. అయినప్పటికీ జరుగుతున్న ప్రమాదాలకు కారణాలు గుర్తించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏటా పెరుగుతున్న ప్రమాదాలు..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు ప్రతీ ఏటా పెరుగుతూనే ఉన్నాయని అధికారుల నివేదికలు చెబుతున్నాయి. 2021-22లో 54 మంది మృతి చెందారు. 2022-23లో 47 మంది, 2023-24లో 36 మంది, 2024-25లో ఇప్పటివరకు 21 మంది, జిల్లా విభజన తర్వాత 2025-26లో ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు ఆరుగురు మృతి చెందారని విద్యుత్ శాఖ నివేదికలు చెబుతున్నాయి.

అందించిన నష్టపరిహారం ఇలా..

విద్యుత్ ప్రమాదాలు జరిగిన వెంటనే నష్టపరిహారం కోసం అధికారులు కృషి చేస్తారు. కాని పరిహారం రావడానికి జాప్యం జరుగుతూనే ఉంటుంది. ఇప్పటివరకు మూడేళ్లలో (2021-22 నుంచి 2024-25వరకు) విద్యుత్

- ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాల్సిందే..
- వర్షాకాలంలో మరింత అప్రమత్తత అవసరం

ప్రమాదాల వల్ల 158 మంది వ్యక్తులు మృతి చెందగా వారికి సంబంధించి నష్టపరిహారాన్ని బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ ఏడాదిలో చనిపోయిన ఆరుగురికి నష్టపరిహారం ప్రతిపాదనలు పంపించారు.

గృహ వినియోగదారులకు సూచనలు

- ఇంటికి ఎర్తింగ్ ఇచ్చినప్పుడు కనీసం రెండు ఎర్త్ ఎలక్ట్రోడ్‌లను అమర్చాలి. అసాధారణ శబ్దాలు గ్రైండర్, ఏ.సి , రిఫ్రిజిరేటర్‌లో వచ్చినప్పుడు అశ్రద్ధ చేయకుండా నైపుణ్యం కలిగిన వారి చేత మాత్రమే పరీక్షించాలి.
- ఒకే ప్లగ్ పాయింట్ నుంచి లూజ్‌వైర్లు/ టెంపరరీగా అనేకమైన పరికరాలను కలపకూడదు. ప్లగ్‌ను తీసినప్పుడు వైరును లాగరాదు. గృహవిద్యుత్ ఉపకరణాలను వాడేటప్పుడు వాటి తయారీదారు నిర్ధేశించిన సామర్థ్యం కలిగిన మూడు పిన్స్ ప్లగ్ సాకెట్లనే వాడుతూ మూడో పిన్నును విధిగా ఎర్తింగ్ చేయాలి.

రైతులకు సూచనలు ఇలా..

- ఎక్కడైనా విద్యుత్ వైర్లు కిందికి వేళాడుతున్నప్పుడు మధ్యలో స్తంభాలు ఏర్పాటు చేయాలి. దెబ్బతిన్న విద్యుత్ స్థంభాలను వెంటనే తొలగించి, వాటి స్థానే కొత్తవి ఏర్పాటు చేయాలి. దెబ్బతిన్న కండక్టర్లు(వైర్లు)ను తీసివేసి కొత్త కండక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి.
- వ్యవసాయ పంపు సెట్లకు సంబంధించి మోటార్ స్టార్టర్లు, స్విచ్‌లు ఉన్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగ్ చేయాలి. విద్యుత్ షాక్ తగులకుండా ఉండేందుకు 30ఎంఏ సామర్థ్యం కలిగిన ఆర్‌సీసీబీని మాత్రమే ఉపయోగించాలి. తడి చేతులతో, నీటిలో నిలబడి విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు నిమిత్తమై ఎక్కరాదు.
- పామాయిల్ తోటలలో గెలలు కోసేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. గెలలు కోసే ముందు రైతులు విద్యుత్ సిబ్బందికి తెలపాలి. అక్కడ వైర్లు పరిస్థితి ఎలా ఉందో విద్యుత్ సిబ్బంది పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చే అవకాశం ఏర్పడుతుంది. ఈదురుగాలులు వీచిన సమయంలో గాని , ఇతరత్రాగాని విద్యుత్ వైర్లు తెగి పడితే వెంటనే 1912కు ఫోన్ ద్వారా తెలపాలి.
- ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించే ప్రయత్నంలో చేతులతో తాకకుండా ఎండుకర్రతో విద్యుత్ తీగను ప్రమాదానికి గురైన వ్యక్తి నుంచి వేరుచేయాలి.

వాణిజ్య సముదాయాల వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- కరెంటుకు సంబంధించిన పనులు చేసేటప్పుడు విధిగా చెప్పులు, చేతి తొడుగులు ధరించి చేయాలి. కాటన్ మిల్స్ వారు ప్యానల్ బోర్డు మీద మోటార్ల మీద కాటన్ డస్టు లోనికి వెళ్ళకుండా జాగ్రత్త వహించాలి. అన్ని స్విచ్ బోర్డులకు పానెల్ బోర్డులు ముందు రబ్బరు మ్యాట్లు విధిగా ఏర్పాటు చేసుకోవాలి.



వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులకు మంచినీరు అందిస్తున్న సేవా సిబ్బంది

మార్మోగిన గోవింద నామస్మరణ

- ద్వారకాతిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గోవిందనామాలతో శ్రీవారి క్షేత్ర ఆలయ ప్రాంగణం శనివారం మార్మోగింది. స్వామికి ప్రీతికరమైన రోజుకావడంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తులు రాకతో భక్తుల రద్దీ పెరిగింది. ఆషాడమాసం శూన్యమాసమైనా దాదాపు 20 వేల మంది భక్తులు వచ్చారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎండవేడి అధికంగా ఉండడంతో క్యూలైన్ల వద్ద, వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద భక్తులు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో ఆలయ సిబ్బంది, సేవాసంఘాల సిబ్బంది మంచినీరు అందజేశారు. చల్లని నీడ కోసం భక్తులు చెట్ల నీడకు పరుగులు తీశారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం తీర్థ, అన్నప్రసాదాలను స్వీకరించారు.

కేసుల తీర్పుల్లో నాణ్యత లోపించకూడదు

- ఉమ్మడి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జస్టిస్ సురేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు క్రైం, జూలై12(ఆంధ్రజ్యోతి) : కేసుల తీర్పులు త్వరితగతిన వెలువరించాలని, తీర్పులలో నాణ్యత లోపించకూడదని న్యాయ మూర్తులకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి సూచించారు. శనివారం ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో జ్యుడీషియల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమూర్తులు కేసులను త్వరితగతిన విచారించి తీర్పులు వెలువరించాలన్నారు. సివిల్ కేసులు, విచారణలో ఉన్న ఖైదీల కేసులను త్వరితగతిన తీర్పులను వెలువరించడానికి ప్రయత్నించా లన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని కోర్టులలో ఉన్న పెండింగ్ కేసులు వివరాలు, భవన సముదాయాల పరిస్థితులపై వివరించారు. జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కుల విడుదల

పోలవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,788 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేశామని ఈఈ యేసుబాబు శనివారం తెలిపారు. గోదావరి నీటిమట్టం 18 మీటర్లకు పైబడి ఉండడంతో 22 మోటార్లు 22 పంపుల ద్వారా నీటి విడుదల చేశామన్నారు. కృష్ణా ఉమ్మడి పశ్చిమ డెల్టాల సాగునీటి అవసరాల రీత్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోటార్లు, పంపుల సంఖ్య పెంచామన్నారు.



పట్టిసీమ ఎత్తిపోతల నుంచి నీటి విడుదల



నడకతోనే ఆరోగ్యం

- వ్యాయామంపై పెరిగిన ఆసక్తి



ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 80 వ్యాయామ శాలలు... 1.50 లక్షల మంది వాకర్స్

ప్రస్తుత సమాజంలో చిన్నాపెద్ద, ధనిక పేద ఎవరి నోట విన్నా వ్యాయామం అనే మాట వినిపిస్తుంది. శారీక వ్యాయామం తగ్గిన నేటి పరిస్థితుల్లో పౌరులు నడక, వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. వ్యాయామం, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గ్రహించారు. ఆసక్తి పెరిగింది. ఉదయం వాకింగ్ చేసే వారి సంఖ్య, జిమ్‌లకు వెళ్లి వ్యాయామం చేసే వారి సంఖ్య పెరిగింది. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

పాలకొల్లు జూలై 12(ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుతం సుమారుగా 80 వ్యాయామశాలలు ఉన్నాయి. లక్షా 50వేల మంది ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ రోజూ నడుస్తున్నారు. జిల్లాలో 80 వాకర్స్ క్లబ్‌లు ఉండగా వేల సంఖ్యలో వాకర్స్ నిత్యం నడుస్తూ పలువురిని నడిపిస్తున్నారు. రెండు మూడు దశాబ్దాలకు వెనక్కి వెళితే కార్మిక కర్షక వర్గాలతో పాటు 50శాతం పైబడి పౌరులకు శారీరక శ్రమ ఉండేది, పేద మధ్య తరగతి వర్గాలలో 90శాతం పైబడి పురుషులు సైకిళ్ల తొక్కేవారు. ఇంటి పట్టున ఉండే మహిళలు బట్టలు ఉతకడం, పిండి రుబ్బడం, అంట్లుతోమడం, ఇంటికి చాకిరీ చేసుకుంటూ శరీరానికి తగినంత పని కల్పించే వారు.. నేడు ఇంటి వద్ద ఉండే మహిళలకు శారీరక శ్రమ లేకుండా కట్టెల పొయ్యి స్థానంలో గ్యాస్ స్టవ్‌లు వచ్చేశాయి. రుబ్బురోలుతో పనిలేకుండా మిక్సీలు, గ్రైండర్లు అందుబాటులో ఉన్నాయి. బట్టలు ఉతికేందుకు వాషింగ్ మిషన్లు, చివరకు ఇంటిలో చీపురు అవసరం లేకుండా వాక్యూం మిషన్లు, సంప్రదాయ ఆహారం స్థానంలో ఫాస్ట్, జంక్ ఫుడ్‌లు ఇలా దైనందిన జీవితంలో అన్నింటా మార్పులు రావడంతో ఊబకాయాలు పెరగడమే కాకుండా బీపీ, షుగర్ వంటి రోగాల బారిన పడుతున్నారు. ఇప్పుడు కూలీలుపని చేసుకునే కార్మికవర్గాలు సైతం బైక్ లేనిదే కాలు బయట పెట్టడం లేదు. కాలినడక, సైక్లింగ్ పూర్తిగా మర్చిపోయారు పేద, సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలు బైక్‌లు స్కూటీలు వాడుతుంటే మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వారు కార్లు వాడుతున్నారు ఈ పరిస్థితుల్లో వ్యాయామం లేక రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ఈవిధంగా రోగాల బారిన పడుతున్నవారికి సమతుల్య ఆహారం అందిస్తామంటూ కొన్ని ఆహార కేంద్రాలు పుట్టుకొస్తున్నాయి. వాటి వల్ల ఉపయోగం ఉందో లేదో కానీ, సొమ్ములు దండీగానేలాగేస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇప్పుడు సుమారు 42 లక్షల మంది జనాభా ఉండగా అందులో సుమారు 2 లక్షల మంది మైదాన ప్రాంతాలు, రహదారులు వెంబడి పార్కులలోనూ వాకింగ్ చేస్తుండగా సుమారు 2 లక్షల మంది మహిళలు ఇంటివద్దనే ఉంటూ తేలికపాటి నడకవంటి వ్యాయామాలు చేస్తున్నారు. ఇప్పుడు పలు వ్యాయామ శాలలో పౌరుల వయస్సును బట్టి వ్యాయామ శిక్షణ అందిస్తున్నారు. నిత్యం 30 నిమిషాలు తక్కువ కాకుండా వ్యాయామం చేస్తే శరీరంలో ఉండే చెడు కొవ్వు తగ్గడమేకాకుండా స్థూల కాయం నియంత్రించడం బీపీ, షుగర్ వంటి వ్యాధులు అదుపులోకి రావడం, ముఖ్యంగా శరీర పటుత్వం పెరిగిన కంటి చూపు మెరుగు పడడం. ఆయువు పెరగడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని వ్యాయామ శాలల నిర్వాహకులు, వైద్యులు చెబుతున్నారు.

25 ఏళ్లుగా వ్యాయామం చేస్తున్నా..



గత 25 ఏళ్లుగా క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నా. దీని వల్ల ఏవిధమైన అనారోగ్య సమస్యలు తలెత్తలేదు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు లేవు ఒకటి.. రెండుసార్లు తప్ప జ్వరం కూడా రాలేదు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఫిట్నెస్‌తో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉంటుంది.

\- గాది వెంకన్న
ఆధ్యాత్మిక వేత్త, పాలకొల్లు

వ్యాయామానికి ప్రాధాన్యం పెరిగింది



గత 16 ఏళ్లుగా జిమ్ కోచ్‌గా పనిచేస్తున్నా. 12 ఏళ్ల నుంచి సొంతంగా వారాహి జిమ్ పేరుతో జిమ్ నిర్వహిస్తున్నా. పురుషులతో పాటు, మహిళలు జిమ్‌కు వస్తున్నారు. రోజుకు స్త్రీ, పురుషులతో కలిపి 150 మంది వరకు శిక్షణ పొందుతున్నారు. యువత జిమ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

\- మడ్డు వాసు
జిమ్ నిర్వాహకుడు, పాలకొల్లు

క్రైమ్ సమాచారం

అపార్టుమెంటు వాచ్‌మన్ ఆత్మహత్య



శ్రీను మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఒక అపార్టుమెంటులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఓవ్యక్తి అనుమానాస్పదస్థితిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన పచ్చిపాల శ్రీను (30)కు 2020లో వివాహమైంది. అతడికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. నెల రోజుల క్రితం ఏలూరు శాంతినగర్ మూడో రోడ్డులోని అపార్టుమెంటులో వాచ్‌మన్‌గా చేరి కుటుంబంతో ఉంటున్నాడు. పగటి వేళ తాపీ పనులకు వెళ్తున్నాడు. తాను ఉంటున్న గదిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



రాము మృతదేహం

కలిదిండి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మండలం మూల్లంక గ్రామానికి చెందిన మామిడిశెట్టి రాము(45) చేపల చెరువుపై కాపలా ఉంటున్నాడు. భార్య కువైట్‌లో ఉంటోంది. కుటుంబ సమస్యలతో కొంతకాలంగా అతడు మద్యానికి బానిస య్యాడు. రోజురోజుకు సమస్యలు తీవ్రమవడంతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి చేపల చెరువు వద్ద విషపూరిత గ్యాస్ బిళ్లలను నీటిలో కలుపుకుని తాగేశాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన వైద్యం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అతడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి మహిళ మృతి

పోడూరు, జూలై12(ఆంధ్రజ్యోతి):పాలకొల్లు-పెనుమదం రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. పాలకొల్లు రామయ్యహాలు నగర్‌కు చెందిన దిగమర్తి ప్రమీళ(30) పాలకొల్లు నుంచి పెనుమదం స్కూటీ వాహనంపై చర్చికి వెళ్తుంది. ఈక్రమంలో రోడ్డు మధ్యలో వున్న గొయ్యిని తప్పించబోయి అదుపు తప్పి పడి పడిపోయింది. రాత్రి సమయంలో రోడ్డుపై ఉన్న గొయ్యి కనబడకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆమెకు వివాహమైనప్పటికీ భర్తతో గొడవ కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తండ్రి వీధి గనిరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

- ఏడుగురికి తీవ్ర గాయాలు



లారీని ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం

ఏలూరు క్రైం, జూలై 12(ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం నుంచి చెన్నై వెళ్తున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 16వ నంబరు జాతీయ రహదారి గుండుగొలను వద్ద ముందు వెళ్తున్న లారీని శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఏడుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. విశాఖపట్టణం నుంచి ఎంఆర్‌ఎం ప్రైవేటు ట్రావెల్ బస్సు వైజాగ్‌లో శుక్రవారం రాత్రి పదకొండు గంటలకు బయలుదేరింది. అర్ధరాత్రి దాటిన తరువాత భీమడోలు మండలం తిరుమల డైరీ సమీపంలో ముందు వెళ్తున్న లారీని అతి వేగంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో తమిళనాడు మదురైకి చెందిన బస్సు డ్రైవర్ సురేష్ సుభాష్, కర్ణాటకలోని ఉబ్బివెళ్ళి గ్రామానికి చెందిన జానప్ప వెంకటేష్, బెంగళూరుకు చెందిన శ్రీరామ్, ములగలేటి శ్రీకాంత్, శ్రీకాకుళం జిల్లా నందిగామ గ్రామానికి చెందిన నితీష్‌కుమార్, తునికి చెందిన పాడి హిమగంగ, విశాఖపట్టణానికి చెందిన జాజుల చంద్రకళ తీవ్ర గాయాలకు గురయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి శనివారం తెల్లవారు జామున చేర్పించారు. ఈ ఘటనపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యమంటూ వాట్సాప్‌లో మెసేజ్

- ఎస్పీ ఆదేశాలతో ఆచూకీ కనుగొన్న శక్తి టీమ్

ఏలూరు క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఒక బాలిక ఇంట్లో అలిగి ఇల్లు విడిచిపెట్టి వెళ్లిపోవడంతో వాట్సాప్‌లో ఆ బాలిక ఫొటో రావడంతో వెంటనే ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, శక్తి టీమ్ పోలీస్ సిబ్బంది కలిసి బస్టాండ్‌లో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ ఉన్న ఆ బాలికను శనివారం సాయంత్రం గుర్తించారు. ఆ బాలిక భీమవరంలోని తన కుటుంబ సభ్యులపై కోపంతో అలిగి వచ్చేసినట్టుగా గుర్తించారు. బాలికను సంరక్షణ నిమిత్తం వన్‌స్టాప్ సెంటర్‌కు తరలించారు. బాలిక సమాచారం కుటుంబ సభ్యులకు అందించారు.



మృతుడి కుటుంబంతో గ్రామస్థుల ధర్నా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

న్యాయం చేయాలంటూ బాధితుల ధర్నా

ఆగిరిపల్లి, జూలై12 (ఆంధ్రజ్యోతి):నెక్కలం అడ్డరోడ్డు వద్ద శుక్రవారం కోడిగుడ్ల వ్యాను ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించారు. వారికి బాసటగా గ్రామస్థులు ధర్నా చేసిన ఘటన శనివారం నెక్కలం గొల్లగూడెంలో జరిగింది. నెక్కలం గొల్లగూడెంకి చెందిన పటాపంచల గంగరాజు (35) శుక్రవారం ద్విచక్ర వాహనంపై ఆగిరిపల్లి వస్తుండగా, ఎన్టీయార్ జిల్లా నున్న నుంచి కోడిగుడ్ల కోసం ఆగిరిపల్లి వస్తున్న వ్యాన్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు తీవ్ర గాయాలపాలవ్వగా చికిత్స కోసం విజయవాడ తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్థులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ వారికి సరైన న్యాయం జరగకపోవడంతో నెక్కలం గొల్లగూడెంలో మధ్యాహ్నం రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, నూజివీడు టౌన్ సీఐ, ముసునూరు, నూజివీడు టౌన్, నూజివీడు రూరల్ ఎస్ఐ ధర్నా ప్రాంతానికి చేరుకున్నారు. గ్రామ పెద్దలు, నూజివీడు డీఎస్పీ వద్ద చర్చలు జరపడంతో ప్రమాదానికి కారణమైన వాహన యజమానులతో చర్చించి, ఎట్టకేలకు ఈ సమస్యను డీఎస్పీ పరిష్కరించడంతో ధర్నా విరమించారు. సుమారు మూడున్నర గంటలకుపైగా ధర్నా నిర్వహించడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వస్త్రదుకాణంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తణుకు, జూలై12(ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణంలోని ఆలమూరి వీధిలో ఉన్న వస్త్రదుకాణంలో అగ్నిప్ర మాదం ఆదివారం తెల్లవారు జామున జరిగింది. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణంగా షాపులో వస్త్రాలు కాలిపోయాయి. అంజన టవర్స్‌లోని మొదటి అంతస్తులోని ఫ్యాన్సీ షాపు, వస్త్రాలు ఉన్నాయి. ఆయా షాపులకు సంబంధించి అగ్ని ప్రమాదం జరిగింది. తణుకు అగ్నిమాపక వాహనం మరమ్మతుల కారణంగా అత్తిలి వాహనం, సిబ్బంది వచ్చి పూర్తిగా మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.10లక్షల ఆస్తినష్టం జరిగిందని భావిస్తున్నారు. అత్తిలి అగ్నిమాపకాధికారి గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతుచిక్కని వ్యాధితో మేకలు మృత్యువాత!

- మూడు రోజుల్లో 9 మేకలు మృతి



ఆగిరిపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి):అంతుచిక్కని వ్యాధి సోకి మేకలు మృతి చెందడంతో వడ్లమాను గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల వ్యవధిలో ఒకే రైతుకు చెందిన తొమ్మిది మేకలు మృతి చెందాయి. సాదం స్వామి సుమారు 30 మేకలతో జీవనం సాగిస్తుండగా, గురువారం ఒక మేక, శుక్రవారం 4, శనివారం మరో 4 మృతి చెందాయి. శుక్రవారం స్థానిక పశువైద్య సిబ్బందికి తెలియపరచడంతో వారు వచ్చి చూసినప్పటికి వ్యాధి అర్థం కాలేదని బాధితుడు వాపోయాడు. శనివారం మరికొన్ని మేకలు చనిపోవడంతో ఎంపీటీసీ ఆర్.సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ జలసూత్రం వంశీకృష్ణకు తెలపగా వారు పశువైద్యాధికారి హనుమంతరావుకు సమాచారం ఇవ్వడంతో సిబ్బందితో వచ్చి మేకలకు చికిత్స నిర్వహించారు. మృతిచెందిన మేకల విషయంపై నివేదికను ఉన్నతాధికారులకు తెలియపరుస్తానన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు స్వామి, గ్రామస్థులు కోరుతున్నారు.



పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

తాడేపల్లిగూడెం, జూలై 12(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ మహిళా అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆకాంక్షించారు. మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలలో మొక్కల పాత్ర ఎంతో ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. రోడ్డుపక్కగా పెరిగిన చెట్లను నరికే సంస్కృతిని విడనాడాలని సూచించారు.

అల్లూరి చిత్రపటం ఆవిష్కరణ

భీమవరం టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సాహసానికి సంకల్పానికి అల్లూరి ఓ సందేశమని, దేశభక్తికి త్యాగానికి అల్లూరి సీతారామరాజు మనందరికీ ఆదర్శమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బోండా రాంబాబు అన్నారు. విప్లవ వీరుడు అల్లూరి విద్యాభ్యాసం చేసిన భీమవరం లూథరన్ హైస్కూల్లో శనివారం అల్లూరి తెల్లవర్ల భారీ చిత్రాన్ని ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి అల్లూరి సాయి దుర్గరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా కట్లమ్మ



గణపవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మొయ్యేరు గ్రామదేవత కట్లమ్మ అమ్మవారికి శాకంబరీదేవిగా అలంకరించారు. గ్రామంలోని అమ్మవారు గంటశాలవారి ఆడపడుచుగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆషాఢ సారెతో పాటు అమ్మవారికి కూరగాయలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేశారు.

గుబ్బాలమ్మకు ఆషాఢ సారె



పెంటపాడు, జూలై 12(ఆంధ్రజ్యోతి) : ముదునూరు గ్రామంలోని గ్రామ దేవత గుబ్బాలమ్మకు శనివారం గ్రామస్థులు ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

పశుగ్రాసాలపై ప్రభుత్వం రాయితీ

ఆకివీడు రూరల్ జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాయితీపై ప్రభుత్వం అందించే పశుగ్రాసాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి భార్గవి సత్య తెలిపారు. గుమ్ములూరు, అయిభీమవరం గ్రామాలలో పశుగ్రాసవారోత్సవాలలో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను తెలియజేశారు. పోషకాలు అధికంగా ఉండి తేలికగా జీర్ణమై పాలదిగుబడి అధికంగా ఉండే రకాలను వినియోగించాలని తెలిపారు. 10 సెంట్లు నుంచి 50 సెంట్లు వరకు భూమి ఉన్నవారికి పశు గ్రాసాలను సాగుచేసుకోవడానికి అనుమతిస్తారని తెలిపారు.



ఎస్ఆర్‌కేఆర్‌లో 1996-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమావేశం

భీమవరం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 1996 - 2000 బ్యాచ్‌లో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల రజతోత్సవ వేడుకలు శనివారం కళాశాల ప్రాంగణంలో జరిగాయి. కార్యక్రమానికి సివిల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ జి. శ్రీబాల అధ్యక్షత వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, అధ్యాపకులు ఎస్‌వీ రంగరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలేయ బాధితుడికి వాకర్స్ క్లబ్ సాయం



నరేంద్ర బాబుకు మందులు అందిస్తున్న వాకర్స్ సభ్యులు

పాలకొల్లు టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటకు చెందిన ఇయ్యపు నరేంద్రబాబు కాలేయ వ్యాధితో బాధపడుతు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రిలో అవసరమైన ఇంజక్షన్లు అందుబాటులో లేక పోవడంతో విషయం తెలిసిన వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ డిప్యూటి గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్‌కు విషయాన్ని తెలియచేయడంతో నరేంద్ర బాబుకు రూ.18వేలు విలువైన ఇంజక్షన్లు, సూదులు క్లబ్‌సభ్యులతో కలిసి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వీర్ సాహెబ్, పోతుల ఉమాశంకరరావు, మానెం బసవరాజు, సభ్యులు జవ్వాజి కళ్యాణ్, నంబూరి గంగా పవన్, చామా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకొల్లు ఏఎంసీ చైర్మన్‌గా కోడి విజయభాస్కర్



పాలకొల్లు టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సగంచెరువు గ్రామానికి చెందిన కోడి విజయ భాస్కర్ నియమితులయ్యారు. గౌరవాధ్యక్షులుగా స్థానిక ఎమ్మెల్యే, జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, సభ్యులుగా దాసరి రత్నరాజు, బిట్రా లక్ష్మీనారాయణ, గరికిపాటి రాజేశ్వరి, గుబ్బల లక్ష్మీ, జడ్డు లక్ష్మీ తులసీ అమ్మాజీ, కలిదిండి రామచంద్రరాజు, కొక్కిరిమిట్ట అమ్మాజీ, కొండేటి లక్ష్మీ, కొప్పిశెట్టి జ్వాల, రాయి శ్రీనివాసరావు, వాసా భ్రమరాంబ, నీలం నారాయణ మూర్తి, పారుపల్లి వీర వెంకట లక్ష్మీ కనక దుర్గ, సానబోయిన వెంకట శ్రీనివాసరావు నియమితులయ్యారు.

రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందించాలి

ఆచంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఒక పక్క వర్షాలు రాక మరో వైపు సాగునీరు అందక నారుమడులు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. శనివారం సీపీఎం మండల కమిటీ సమావేశం కమిటి సభ్యులు కుసుమే జయరాజు అధ్యక్షతన నిర్వహించారు. కోడేరు బ్యాంక్ కెనాల్ నుంచి సాగునీరు సరిగ్గా అందడం లేదని రైతులు వేసిన నారుమళ్ళకు నీరు లేక ఎండిపోతున్నాయన్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారంటూ ఆందోళన



వైన్‌షాపునకు తాళం వేసిన దృశ్యం

పాలకోడేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా అధిక ధరలకు మద్య ం అమ్ముతున్నారంటూ గ్రామస్థులు వైన్ షాపు వద్ద శనివారం రాత్రి ఆందోళన చేపట్టడంతో వివాదం తలెత్తింది. దీం తో ఆ వివాదాన్ని అదుపు చేసేందుకు పాలకోడేరు పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్ళి ముందుగా వైన్ షాపును మూయించారు. ప్రభుత్వం ఎమ్మార్పీ రేట్ల ప్రకారంగా మద్యం అమ్మాలని నిబంధన ఉన్నప్పటికీ మద్యం షాపు యజమానులు ఇష్టానుసారంగా బాటిల్‌కు రూ.10 ఎక్కువ ధరకు అమ్మకాలు చేపట్టడంతో స్థానికులు గుమిగూడి బ్రాందీ షాపు యాజమాన్యాన్ని ప్రశ్నించారు. షాపు వద్ద గందరగోళ పరిస్థితి నెలకొనడంతో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని ఆ వివాదాన్ని పరిష్కరించే విధంగా షట్టర్ మూయించి యాజమాన్యంతో మాట్లాడుతున్నారు.

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

పెనుమంట్ర, జూలై 12(ఆంధ్రజ్యోతి): పెనుమంట్ర మండలంలో వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌ల నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది కాలం పాటు సాగిన సొసైటీలలో త్రిసభ్య కమిటీల పాలన సాగనున్నది. సోమరాజు ఇల్లిందలపర్రు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా నడింపల్లి సత్యనారాయణరాజును నియమించారు. పొలమూరు సొసైటీకి కండిబోయిన శ్రీనివాస్, ఆలమూరు సొసైటీ కి నెలమూరుకు చెందిన మాజీ సర్పంచ్ కోయ నాగ వెంకట పోతురాజు నియమితులయ్యారు. మామిడూరుకు బైరిశెట్టి దుర్గారావు, జుత్తిగకు వీరవల్లి రాంబాబు, పెనుమంట్రకు జవ్వాది సురేష్, సత్యవరానికి మైగాపుల నాగ వెంకట శ్రీరాములు (రాము), కొయ్యేటిపాడుకు పాల భోగేశ్వరరావులను నియమించారు.



మట్టా వెంకట్

తణుకు రూరల్: తణుకు రూరల్ మండలం తేతలి సహకార సంఘం (పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా మట్టా వెంకటేశ్వరరావు (వెంకట్), దువ్వ సొసైటీకి చిక్కాల వేణుగోపాల చంద్రశేఖర్, పైడిపర్రుకు పాలకుర్తి వీర వెంకట సత్యనారాయణ, ముద్దాపురానికి ముళ్లపూడి శ్రీనివాసరావులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పెంటపాడు: కోరుమిల్లి సొసైటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సొసైటీ చైర్మన్ వల్లూరు సాయిరమేష్ అన్నారు. శనివారం కోరుమిల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ తనతో పాటు సభ్యులుగా కొండ్రెడ్డి బుల్లిరాజు (మీనవల్లూరు), జేష్ట వెంకట సుబ్బారావు (బీ.కొండేపాడు) నియామకమైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గారపాటి ఉదయ్‌భాస్కరరావు, పుట్టా దేవవరప్రసాద్, దేవళ్ళ శివప్రసాద్, దేవళ్ళ నారాయణ తదితరులు అభినందనలు తెలిపారు.







తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ.. తాళ్ళ ముదునూరుపాడులో వలవల బాబ్జి.. శేరేపాలెంలో పొత్తూరి రామరాజు టీడీపీ సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న దృశ్యం

సమస్యలు తెలుసుకునేందుకే ఇంటింటి ప్రచారం

సంక్షేమ పథకాల గురించి వివరిస్తూనే స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుంటున్న టీడీపీ నాయకులు

భీమవరం టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి తొలి ఏడాది పాలనపై ఇంటింటికి వచ్చి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నామని రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. మెంటేవారితోటలో కరెంటు, తాగునీరు సరఫరా సమస్యలపై ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సంబంధిత అధికారులతో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తామని ఆమె అన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు మద్దుల రాము ఆధ్వర్యంలో ఇంటింటికి కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి పొత్తూరి బాపిరాజు, చెల్లబోయిన గోవిందు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు: ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని 27,28వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళుతూ సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో పట్టణాన్ని మురికి కూపంలా మార్చారని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం జవాబుదారితనంతో పరిపాలన చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తుందని వివరించారు. పర్యటనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని చెప్పారు.

ఉండి: చెరుకువాడలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి యిర్రింకి సత్యనారాయణ(బుజ్జి) గ్రామంలోని ఆయా వీధులలో ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు తదితర వాటిని బ్రోచర్‌లో ప్రచురించిన వాటిని ప్రజలకు, మహిళలకు అందించారు.

మొగల్తూరు: శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు ఇంటింట పర్యటించి గ్రామస్థులకు కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, దూసనపూడి రమేష్, ఫులపర్తి రాంబాబు, లోకం శ్రీనివాస్, పెచ్చెట్టి నాగేశ్వరరావు, నాగిడి రాంబాబు, ఆకన కోటేశ్వరరావు, బాలాజీ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. శనివారం తాళ్ళముదునూరుపాడు 18వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలపై స్థానికులతో మాట్లాడి కరపత్రాలను పంపిణీ చేశారు. టైలరింగ్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మత్తు మందులను దరిచేరనియరాదని అప్పుడే సమాజం, కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి సూచించారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని ఎఫ్‌సీఐ గోదాముల వద్ద శనివారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా జట్టు కార్మికులకు అవగాహన కల్పించారు. ముందుగా జట్టు కార్మికులతో మత్తు, మద్యంకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు దొర బాబు, మురళిమోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: గంజాయి, సారా, ఆల్కహాల్, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల విననియోగం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, కాబట్టి మాదక ద్రవ్యాల వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు, ఎస్‌యు మహేష్ అన్నారు స్థానిక ఎర్రవంతెన వద్ద శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు

మ్యాథ్స్ ఫ్యాకల్టీ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ సబ్జెక్టు (గెస్ట్) ఫ్యాకల్టీ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి నాగవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అతిథి పద్ధతిలో నియామకం చేపడతామన్నారు. విద్యార్హత పోస్టు గ్రాడ్యుయేషన్ (సబ్జెక్టు) 50శాతం ఉండాలని, ఆసక్తిగత అభ్యర్థులు ఈనెల 17 నాటికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 18న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

డ్రైవర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసేందుకు అవుట్ సోర్సింగ్ విధానంలో రోజువారీ వేతనంతో పనిచేసేందుకు డ్రైవర్‌లను తీసుకుంటున్నామని డిపో అసిస్టెంట్ మేనేజర్ ఏడీఎల్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్‌ల బయోడేటా పరిశీలించి ఎంపిక జరుగుతుందన్నారు. హెవీ లైసెన్స్‌తో రెండు సంవత్సరాల సీనియారిటి కలిగి ఉండి ఎటువంటి యాక్సిడెంట్స్ లేనట్టు బ్రేక్ ఇన్‌స్పెక్టర్ నుంచి లెటర్, ఆధార్ కార్డుతో ఈనెల 14 సాయంత్రం 5 గంటల లోపు డిపోమేనేజర్‌ను సంప్రదించాలని సూచించారు.

అందుబాటులో ఎరువులు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలంలో 25వేల ఎకరాల్లో వరి సాగుచేశాస్తున్నారని ఆ వరిసాగుకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి డాక్టర్ నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోర్ల కింద 19 వేల ఎకరాలు, కాలువ కింద 6వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని వివరించారు. అధికంగా స్వర్ణరకం సాగుచేస్తున్నందున రైతులంతా ఎరువుల యాజమాన్య పద్ధతిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలంలో సొసైటిల ద్వారా ఎరువుల వ్యాపారం చేస్తున్న 14 డిపోలలో 355 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఇతర కాంప్లెక్స్ ఎరువులు కూడా పూర్తిస్థాయిలో లభ్యమవుతున్నాయని తెలిపారు.



ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు, పాలకవర్గానికి నియామక పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఏఎంసీ చైర్మన్‌కు నియామక పత్రం అందజేత

ఆకివీడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావుతో పాటు పాలకవర్గానికి శనివారం స్థానిక మాదివాడ కోదండ రామాలయంలో టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ నియామక పత్రాని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా, రాష్ట్ర రైతు నాయకుడు భూపతిరాజు తిమ్మరాజు, మహిళా మండలాధ్యక్షురాలు బచ్చు సరళాకుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు బొర్రా సుజాత, కౌన్సిలర్ బత్తుల శ్యామల, మైనార్టీ జిల్లా కార్యదర్శి అజ్మల్ పాల్గొన్నారు.

ఏడాది పాలనలో చంద్రబాబు చేసిందేమీ లేదు

పాలకొల్లు అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో రాష్ట్రానికి చంద్రబాబు చేసిన మేలు ఏమీ లేదని పలువురు వైసీపీ నాయకులు అన్నారు. లయన్స్ క్లబ్ హాల్లో శనివారం వైసీపీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి అధ్యక్షత వహించారు. బాబు షూరిటీ, మోసం గ్యారంటీ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అలాగే గూడూరి ఉమాబాల, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

వేములదీవిలో అఖండ అన్న సమారాధన

నరసాపురం రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములదీవి గ్రామంలో శనివారం వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

నారుమడులు వేసుకోవాలి

నరసాపురం రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ముంపునకు తట్టుకునే విధంగా రైతులు విత్తనాలు నాటుకోవాలని ఏవో జ్యోషిన తెలిపారు. ప్రస్తుతం మండలంలోని ఎల్‌బిచర్ల, రుస్తుంబాదా, సీతారాంపురం, మల్లవరం, లక్ష్మణేశ్వరం, గొంది, చిట్టవరం, సరిపల్లి, చినమామిడిపల్లి ప్రాంతాల్లోని రైతుల ఆకుమడులు పోసుకున్నారన్నారు. ముందస్తు సాగు చేయడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు నుంచి పంటను కాపాడుకోవచ్చునన్నారు.

రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా సత్యవతి



నరసాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రోటరీ జిల్లా 2020 అసిస్టెంట్ గవర్నర్‌గా నరసాపురానికి చెందిన గన్నాబత్తుల సత్యవతిని నియమించారు. ఇప్పటి వరకు ఆమె నరసాపురం రోటరీ క్లబ్ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఇక నుంచి నరసాపురంతో పాటు రాజోలు, మల్కిపురం క్లబ్‌లకు కూడా ఆమె అసిస్టెంట్ గవర్నర్‌గా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం నరసాపురం క్లబ్ అధ్యక్షులుగా రమ, కార్యదర్శిగా కుమారి, కోశాధికారిగా సమతా నియమితులయ్యారు. వీరు ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ



రూరల్ పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీవేద

నరసాపురం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, క్రైమ్ వివరాలు తదితర విషయాలను ఎస్సై వెంకట సురేష్‌ను అడిగి తెలుసు కున్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందేలా పోలీసులు వ్యవహరి ంచాలన్నారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలన్నారు. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో సీఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

తణుకు, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలమూరివారి వీధిలో అగ్నిప్రమాద బాధితులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదివారం సాయంత్రం పరామర్శించారు. ప్రమాదంలో ఫ్యాన్సీ, బట్టల దుకాణంలో లో వోల్టేజీ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో పెద్ద ఆస్తినష్టం సంభవించిందని సమాచారం తెలుసుకున్న ఆరిమిల్లి ఘటనా స్థలానికి చేరుకుని సర్వం కోల్పోయిన యజమానులు ఓంకార్, స్వామిలను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.


'రేపు కలెక్టర్‌కు చెప్పుకుందాం'

భీమవరం టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 14న తేదీన కలెక్టర్‌కు చెప్పుకుందాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయనకు ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వాలు మారుతున్న కొద్దీ గీత వృత్తిని నిర్వీర్యం చేసేలా ఉపాధిని దెబ్బతీసేలా విధానాలను అవలంబిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్ర భుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్లు అమ్మకాలు లేకుండా చేసి సంక్షోభంలో పడవేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

16న ఉప సర్పంచ్ ఎన్నికపై సమావేశం

కాళ్ళ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దొడ్డనపూడి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఆకస్మిక ఎన్నికపై ఈ నెల 16న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్‌డీ ఎంవీ భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఉప సర్పంచ్ కొప్పర్తి ఏసురాజు తన పదవికి రాజీనామా చేయడంతో ఖాళీని పూర్తి చేయుటకు ఎన్నిక నిర్వహించేందుకు బుధవారం ఉదయం 11 గంటలకు సర్పంచ్, వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

ఆనందరాజు మృతి తీరని లోటు



ఆనందరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మానవత రాష్ట్ర కన్వీనర్ జానకిరామరాజు

గణపవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వేగేశ్న ఫౌండేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ వేగేశ్న ఆనందరాజు మృతి తీరనిలోటని మానవత స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు, మండల అధ్యక్షుడు గంటా అన్నవరం అన్నారు. శనివారం వైజాగ్‌లో ఆనందరాజు తండ్రి ఏసుదాతరాజును పరామర్శించారు. ఆనందరాజు మృతి ముఖ్యంగా గణపవరానికి తీరనిలోటని ఫౌండేషన్ తరపున అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

పెంటపాడు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనవల్లూరు శివారులో పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు. ఆరుగురిని అరెస్టు చేసి వీరి వద్ద నుంచి రూ 9,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

'రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు'

భీమవరం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడె విజయలక్ష్మి మండిపడ్డారు. శనివారం భీమవరంలో జరిగిన మహిళా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాకినాడ రంగరాయ కళాశాల పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనపై అధికారులందరూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఆరోపించారు. ఎంతో మంది ఉద్యోగినులు బయటకు చెప్పలేక వేధింపులు తట్టుకుని వేదన అనుభవిస్తున్నారన్నారు. బాధ్యులైన అధికారులపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

కల్యాణ మండప నిర్మాణానికి నిధుల కోసం వినతి

భీమవరం టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): భీమవరం మండలంలో ఆర్యవైశ్య కళ్యాణ మండప నిర్మాణానికి ఎంపీ నిధులు కేటాయించాలని మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు కోరారు. శనివారం రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణకు భీమవరంలోని వారి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పర్రిపాటి శ్రీనివాస్, మండల కార్యదర్శి సోము, రంగ వరప్రసాద్, కోశాధికారి సోము వెంకటేష్, బచ్చు కాశీ, జూలూరి నాగేశ్వరావు, వబిలిశెట్టి రంగారావు పాల్గొన్నారు.



మెప్మా ఆర్‌పీలకు ట్యాబ్‌లు అందిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల

మెప్మా ఆర్‌పీలకు ట్యాబ్‌ల పంపిణీ

పాలకొల్లు అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మహిళలపై నమ్మకంతోనే ఆనాడు ముందు చూపుతో రాష్ట్రంలో తొలిసారిగా డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి వారి ఆర్థిక పరిపుష్టికి పునాది వేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో శనివారం 63 మెప్మా ఆర్‌పీలకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ బి విజయసారథి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షుడు జీవి, కర్నేన రోజారమణి, మెప్మా సీఎంఎం రత్నాకరరావు పాల్గొన్నారు.

వాసవీధామ్‌లో హోమం

పెనుగొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి):పెనుగొండ వాసవి శాంతి ధామ్ క్షేత్రంలో మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి వచ్చిన భక్తులతో గోమాత పూజ, అమ్మవారికి అభిషేకం, దంపతీ పూజ, వాసవి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆచంటలో నవగ్రహ నక్షత్ర హోమం

ఆచంట, జూలై 12(ఆంధ్రజ్యోతి):ఆచంటలోని రామేశ్వరస్వామి కల్యాణ మండపం వద్ద జరుగుతున్న శ్రీ చండి సహిత మహారుద్రయాగం కార్యక్రమాల్లో భాగంగా శనివారం నవగ్రహ నక్షత్ర హోమం నిర్వహించారు. జాతకరీత్యా గోచార రీత్యా నవగ్రహాలలో ఏదేని గ్రహదోషం ఉన్నా నక్షత్ర దోషం ఉన్నా ఆయా దోషాల నివారణ కోసం ఆచంటేశ్వరునికి మహారుద్రాభిషేకం, చండీ పారాయణం, అమ్మవారికి కోటి కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం వేద పండితులచే నవగ్రహ నక్షత్ర హోమం నిర్వహించారు. సి. శ్రీకృష్ణమోహన్ దంపతులచే శివ కల్యాణం నిర్వహించారు.

తాడేపల్లిగూడెంలో అభివృద్ధి పనుల పరిశీలన



ఎమ్మెల్యే మద్దిపాటికి అభివృద్ధి పనులు వివరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధి చెందుతున్నదని, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్యేలకే ఆదర్శంగా నిలుస్తారని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కితాబు ఇచ్చారు. తాడేపల్లిగూడెం పట్టణంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, దాతల సహకారంతో నిర్మిస్తున్న జడ్పీ హైస్కూల్ ఆవరణలో వాకింగ్‌ట్రాక్, కడకట్లలో నిర్మించే స్విమ్మింగ్ పూల్, క్రికెట్ స్టేడియం పనులను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శనివారం పరిశీలించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదవారికి అభయ హస్తం సీఎం సహాయ నిధి అని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భీమవరం నియోజకవర్గంలోని 12 మంది లబ్ధిదారులకు రూ.6,03,958 చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఏడాది కాలంలో భీమవరం నియోజక వర్గంలో 222 మందికి రూ.2,06,07,905లు అందించామని తెలిపారు.